# శ్వేతకేశ మహత్యం

**-ఆకెళ్ల వెంకట సుబ్బలక్ష్మి**

"**ఛీ**.. ఛీ... ఏ జన్మలో చేసుకున్న పాపమో ఇది" దువ్వెన విసిరికొట్టాడు రమేశ్.

తొంభై పాళ్లు నెరిసిపోయింది జుట్టు. తండ్రి డాక్టర్ కావడంతోటి, జుట్టుకు రంగు వెయ్యడానికి వప్పుకోడు. ఆరోగ్యరీత్యా నష్టమంటాడు. పైగా "ఇప్పుడు నీ జుట్టు తెల్లగా ఉంటేనేం? నల్లగా ఉంటేనేం. నీకు పెళ్లయింది. ఇద్దరు పిల్లలు. నీకు ముప్పై ఏళ్లు దాటాయి కూడా. నువ్వేమీ కాలేజీ కుర్రాడివి కావు కదా" అంటాడు.

అలా అని తనకి కాలేజీ రోజుల నుంచే నెరవటం మొదలయినా అప్పుడూ వెయ్యనిచ్చేవాడు కాదు. అప్పటి నుంచి ఎన్ని సంవత్సరాలు వెయ్యాల్సి వస్తుందో లెక్కకట్టి చెప్పి, తనకి కేన్సర్ నుంచి ఎన్నిరకాల రోగాలు రావచ్చో ఏకరువు పెట్టి వర్ణించి భయపెట్టేవాడు.

అయినా అదేం ఖర్మో- అమ్మకీ, నాన్నకీ అరవై ఏళ్లు వస్తున్నా తెల్ల వెంట్రుకన్నదే లేదు. (అందుకే వాళ్లకా బాధ తెలియదేమో) మంచి పోలికలు తొందరగా రావుగా. తనకి మాత్రం టీనేజి నుంచే మొదలయ్యింది. కాలేజీ చదువు అయ్యేటప్పటికే సగం జుట్టు నెరిసిపోయింది.

బాబాయి అనీ, మామయ్యనీ, పెద్దన్నయ్య అని ఆడ పిల్లల దగ్గర నుంచీ అందరూ వెక్కిరించేవారు. ఏడిపించే వారు. తన బాధ చెప్పుకున్నా తండ్రి కరిగేవాడు కాదు.

అంతేనా, తను ఇంటర్వ్యూకెళ్లినప్పుడు, మీకింకా ఎలిజిబులిటీ ఉందా అని ఆఫీసర్లు ఆశ్చర్యపోతే, ఇంకా వయస్సు అయిపోలేదా అని కొలీగ్స్ ఆశ్చర్యపోయారు.

ఒకసారి గొడవ చేసిందని పాపని ఆఫీసుకు తీసు కెళితే మీకు ఇంత చిన్న పాప ఉందా అని ఆశ్చర్య పోయారు.

సాయంత్రం ఏడుస్తోందని గౌన్ కొనడానికి తీసికెళ్తే, షాపువాడు మీ మనవరాలికి ఈ గౌన్ బాగుంటుంది అనడంతోటి కోపం వచ్చి కొనకుండా వచ్చేశాడు వాడికి శిక్ష వేసినట్టుగా. కానీ కూతురు మరో షాపులో మూడు రెట్లు ఎక్కువ ధరకి గౌను తీసి తనకి శిక్ష వేసింది. అది వేరే.

ఈ రోజు సాయంత్రం జరిగిన విషయం మరీ బాధాకరం. స్కూటర్ పాడయి బస్సు ఎక్కాడు. అందరూ కాలేజీ వాళ్లే. సుమారుగా అందరూ ఇరవై నుంచి పాతికేళ్ల లోపువారే. తనకి మాత్రమే ముప్పై.

అయినా ఒక కొక్కిరాయి "తాతగారూ, వెనక్కెళ్లండి. మీకెందుకు కాలేజీ అమ్మాయిల దగ్గర" అన్నాడు కన్ను గీటుతూ.

"ఫుట్‌బోర్డులు, డ్రైవర్ దగ్గర స్టాండింగ్‌లు అల్లాంటివి మీకెందుకు? సడెన్ బ్రేక్ వేస్తే పడిపోతారు కూడా" అన్నాడు ఇంకొకడు నచ్చచెబుతున్నట్టు.

అమ్మాయిలందరూ ముసిముసిగా నవ్వుతుంటే తల కొట్టేసినట్టయింది. అయినా అవి వేషాలు కాకపోతే మొహం తెలియదా? వయస్సు అంచనా వెయ్యలేరా? ఈపాటికి పెళ్లి కూడా కానివాళ్లు ఎందరో ఉన్నారు. ఈ మిడిసిపాట్లన్నీ కాలేజీ రోజుల్లోనే చదువు పూర్తయి, ఉద్యోగాల కోసం రోడ్ల మీద తిరిగేటప్పుడు తెలుస్తుంది. ముందుంది లెండి ముసళ్ల పండగ అనుకున్నాడు కసిగా మనసులో.

మర్నాడు పొద్దున రిపేర్‌కిచ్చిన బండి తీసుకుని లేటవుతోందని ఆఫీసుకి హడావుడిగా బయలుదేరాడు. అది పాఠశాలలు ఎక్కువగా వున్న ఏరియా కాబట్టి బండిని జాగ్రత్తగా నడుపుతున్నాడు. సడన్‌గా కుక్కపిల్ల అడ్డం వచ్చింది. బ్రేక్ వేసినా బండి ఆగలేదు. ఎదురుగా వస్తున్నదా ఆటోను గుద్దాడు. దాంతో ఆటో ప్రక్కకు వరిగి డ్రైనేజీ గోతిలో పడింది. రమేశ్‌కి కాళ్లూ, చేతులూ వణక సాగాయి. ఎప్పుడూ ఒక్క చిన్న యక్సిడెంట్ కూడా చెయ్యలేదు ఇంతవరకు. అందరూ కలిసి తంతారేమో? ఎలా భరించాలి ఆ దెబ్బలు, అవమానం. స్కూటర్ ఏం రిపేరు చేశాడో ఏమో, దరిద్రుడు. సమయానికి బ్రేక్ పడలేదు. అందరూ గుమికూడారు. అప్పటికే ఆటోవాడు కోపంగా లేచాడు. అందరూ కలిసి సాయంపట్టి ఆటో లేపారు. అందులో ఒక పాప, ఒక స్త్రీ ఉన్నారు. అదృష్టవశాత్తు ఎక్కువ దెబ్బలు తగల్లేదు.

ఆ మహిళకు మాత్రం కొంచెం గీరుకుంది. రక్తం వస్తోంది. కొంచెం దెబ్బలయినా ఎవరూ వినరు. ఎవరిది తప్పయినా దెబ్బలు తగిలిన వాడిమీదే సానుభూతి చూపిస్తారు. అందులో తనే డాష్ ఇచ్చాడు కూడ. ఆటోవాడు కోపంగా దగ్గరకొచ్చాడు. జనం ఇంక చెప్పాలా! చెమటలు పట్టాయి రమేశ్‌కి.

"బ్రే... బ్రేక్ పడలేదు" అన్నాడు నత్తిగా.

చెయ్యి ఎత్తాడు ఆటోవాడు.

"పోనీలే వదిలెయ్యి. పెద్దవాడు" అంది ఆటోలోంచి దిగిన మహిళ. కారుతున్న రక్తానికి కర్చీఫ్ అడ్డం పెడుతూ.

ఎత్తిన చెయ్యి దించేశాడు ఆటోవాడు. "నీకెందుకయ్యా డ్రైవింగ్. ముసలోడివని వదిలేస్తున్నా. ఓ వందియ్యి రిపేరుకి" అన్నాడు ఆటోవాడు అథారిటీగా.

"బ్రతుకుజీవుడా" అనుకుంటూ వంద చేతిలో పెడుతూ, మొదటిసారిగా తెల్ల జుట్టుని ప్రేమగా నిమురుకుంటూ కదిలిపోయాడు రమేశ్.

■